క్లుప్తంగా

ఉద్యాన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్



కొత్తకోట రూరల్: నాణ్యమైన నర్సరీల ఏర్పాటు, యాజమాన్య పద్ధతులు తెలుసుకుంటే ఉద్యాన విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ డా. పిడిగం సైదయ్య అన్నారు. భారత వ్యవసాయ పరిశోధన మండలి షెడ్యూల్డ్ కులాల ప్రణాళిక ద్వారా కూరగాయల నర్సరీ ఏర్పాటుపై మోజర్ల ఉద్యాన కళాశాల విద్యార్థులకు శనివారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం డా. షహనావాజ్ మాట్లాడుతూ.. కూరగాయల నర్సరీలో నారును ఆశించే రసం పీల్చే పురుగుల నుంచి తొలిదశలోనే కాపాడాలని, వచ్చే పంటలో పురుగుల బెడదను అరికడితే పంట నష్టాన్ని తగ్గించవచ్చన్నారు. మిరప తోటను ఆశించే నల్ల తామర సమస్యలను ఉదహరిస్తూ సమగ్ర కీటక నివారణ చర్యలను వివరించారు. శిక్షణ కార్యక్రమ కో–ఆర్డినేటర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ కత్తుల నాగరాజు కూరగాయల నర్సరీ ప్రాముఖ్యత, నర్సరీలో వాడే ముక్కిన కొబ్బరి పీచు పొడి, వర్మి కంపోస్ట్, పెర్లైట్ మిశ్రమాన్ని ఎలా తయారు చేసి వినియోగించాలో వివరిస్తూ విద్యార్థులతో తయారు చేయించారు. డా. శ్రీనివాస్ నర్సరీలో ఎరువులు, పోషకాలు, నీటి యాజమాన్యం గురించి వివరించారు. డా. భాగ్యశాలి నర్సరీలను ఆశించే నారు కుళ్లు, ఆకుమచ్చల తెగులు నివారణకు విత్తన శుద్ధి చేయాలని సూచించారు. కార్యక్రమంలో గౌతమి, విద్య పాల్గొన్నారు.

పరీక్షల నిర్వహణలో విఫలం

అమరచింత: ఉద్యోగ నియామక పరీక్షల నిర్వహణలో ప్రభుత్వం విఫలమైందని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతూబ్ విమర్శించారు. మండలంలోని కొంకన్వానిపల్లిలో శనివారం ఏఐవైఎఫ్ నాయకులతో కలిసి మండలస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలు, రద్దులతో నిరుద్యోగుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. పేపర్ లీకేజీ కేసుల్లో పలువురిని అరెస్ట్ చేసిన నేపథ్యంలో టీఎస్‌పీఎస్సీని కొనసాగించిన ఫలితం.. రెండోసారి గ్రూప్–1 పరీక్ష రద్దు అని విమర్శించారు. రాష్ట్రంలో 13వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండగా, 5వేలకు మాత్రమే నోటిఫికేషన్ జారీ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. వెంకటేష్, మహేష్, అంజి ఉన్నారు.

రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలి



పాన్‌గల్: బ్యాంకుల్లో రుణాలు పొందిన రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ అన్నారు. శనివారం మండలంలోని చింతకుంట, మాందాపూర్, రాయినిపల్లి, బుసిరెడ్డిపల్లి, కేతేపల్లి, వెంగళాయిపల్లి గ్రామాల్లో పర్యటించి రైతుల రుణమాఫీ, కాల్వల ద్వారా అందుతున్న సాగునీటిపై రైతులతో ఆరా తీశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం విడతలు వారీగా రుణమాఫీ చేయడంతో రైతులకు వడ్డీలు అదనపు భారమయ్యాయని తెలిపారు. వడ్డీతోసహా రుణాలను మాఫీ చేసి, రైతులకు కొత్త రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం మహిళా బిల్లును ఆమోదించడం మంచిదే కానీ.. వెంటనే అమలు చేయకుండా మోసం చేస్తోందన్నారు. రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోకుండా సాగునీటిని విడుదల చేయాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు బాల్‌రెడ్డి, మండల కార్యదర్శి దేవేందర్, రాము ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలం నాగరాలకు చెందిన రాంచంద్రయ్య ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. అంతకుముందు రాంచంద్రయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శివనారాయణ, వేముల శ్రీధర్, చందు, ఆంజనేయులు, నిరంజన్, అశోక్, శివ పాల్గొన్నారు.

గోపాల్‌పేట: మండలంలోని బుద్దారం లక్ష్మీతండాకు చెందిన గోప్యానాయక్ ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకులు తిరుపతియాదవ్, హర్యానాయక్, కోటిరెడ్డి, కోదండం మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. మంత్రి నిరంజన్‌రెడ్డి సూచన మేరకు సింగిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు మేఘారెడ్డి రూ.5వేలు పంపగా, స్థానిక నాయకులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. జింకల బీడుతండాకు చెందిన గోపాల్ వైద్యఖర్చుల నిమిత్తం రూ.5వేల ఆర్థికసాయం అందజేసి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

గణనాథుడికి విశేష పూజలు



అమరచింతలో..



ఆత్మకూర్‌లోని శివాజీనగర్‌లో గణనాథుడికి పూజలు చేస్తున్న భక్తులు

మదనాపురం: వినాయక చవితి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయాలు, ప్రత్యేక మండపాల్లో కొలువుదీరిన గణనాథుడు విశేష పూజలు అందుకున్నాడు. మండల కేంద్రంలోని అభయాంజనేయస్వామి ఆలయం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గణనాథుడి నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

ఆత్మకూర్: పట్టణంలోని శివాజీనగర్, నేతాజీనగర్‌లో ప్రతిష్ఠించిన గణనాథుడికి డాక్టర్ సందీప్‌రెడ్డి, అనితాబసంత్‌రావు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వెంకటేశ్వర కాలనీలో గణేశ్ నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

అమరచింత: పట్టణంలో కొలువుదీరిన గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. రాంనగర్, శివాజీనగర్ చేగువేర యూత్, రవీంద్రనగర్‌లో చిలువరి రాజేష్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో చంటి, అజయ్, నితీష్, చింటు, ప్రదీప్, బుచ్చన్న, నయ్యూం, నాని పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: పట్టణంలోని మూడో వార్డులో కొలువుదీరిన గణనాథుడికి బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అనుజ్ఞారెడ్డి, గోనెల సహదేవుడు, రామకృష్ణ, సత్యనారాయణరెడ్డి, దిలీప్‌రెడ్డి, సుభాష్ యూత్ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు.



మదనాపురంలో గణనాథుడి నిమజ్జనోత్సవంలో పాల్గొన్న భక్తులు



పెబ్బేరు మూడోవార్డులో..

వనపర్తికి రూ.50కోట్లు మంజూరు



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్

వనపర్తిటౌన్: వనపర్తి మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులకు రూ.50కోట్లు మంజూరయ్యాయని మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, వైస్‌చైర్మన్ వాకిటి శ్రీధర్ తెలిపారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో అధికార, విపక్ష, కోఆప్షన్ సభ్యులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మంత్రి నిరంజన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో వనపర్తి శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. మంత్రి కృషితో మంజూరైన నిధులను పట్టణ ప్రజల అవసరాలతోపాటు డబుల్‌బెడ్రూం ఇళ్ల వద్ద రహదారులు, మౌలిక వసతుల కల్పనకు వెచ్చించనున్నట్లు వివరించారు. ఈనెల 29న మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ జిల్లా కేంద్రానికి రానున్నారని తెలిపారు. మున్సిపాలిటీలో 23 అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారన్నారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్, రూ.6కోట్ల ఆడిటోరియం, ఐటీ టవర్, జయశంకర్ పేరు మీద కాలనీ, విగ్రహ ఏర్పాటు, నూతన జిల్లా గ్రంథాలయం ప్రారంభించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా రూ.84కోట్లతో బైపాస్ రోడ్డు, రూ.34కోట్లతో మిషన్ భగీరథ పథకం పనులను ప్రారంభిస్తారన్నారు. జిల్లా కేంద్రంలో మెడికల్, ఇంజినీరింగ్, ఫిషరీస్, నర్సింగ్ కళాశాలల ఏర్పాటు, వేస్టేజ్ మార్కెట్, పాలిటెక్నిక్ కళాశాల మరమ్మతులకు నిధుల కేటాయింపు, రోడ్ల విస్తరణ ఘనత మంత్రి నిరంజన్‌రెడ్డికే దక్కిందన్నారు. మంత్రి చేస్తున్న అభివృద్ధిని చూసి ఇతర పార్టీల నాయకులు ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. సమావేశంలో కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, బండారి కృష్ణ, పాకనాటి కృష్ణ, నాగన్న, పి.రవి, కంచె రవి, వెంకటేష్, భువనేశ్వరి, రాధాకృష్ణ, నక్కరాములు, సమ్మద్, జంపన్న ఉన్నారు.

కౌన్సిల్ అత్యవసర సమావేశం

మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్ అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. మంత్రి కేటీఆర్ పర్యటన ఖరారైన నేపథ్యంలో చేపట్టాల్సిన పనులపై పలు తీర్మానాలు చేశారు. ఇటీవల మున్సిపల్ కార్యాలయ మరమ్మతులకు రూ.50లక్షలు వెచ్చించడంపై మున్సిపల్ వైస్‌చైర్మన్, అధికార పార్టీ కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ బిల్లును ఆమోదించేందుకు కౌన్సిల్ తీర్మానించినట్లు అధికార పార్టీ కౌన్సిలర్లు తెలిపారు.

రూ.4కోట్లతో బ్రిడ్జి నిర్మాణం

పాన్‌గల్: మండలంలోని చిక్కేపల్లి ఒంపుకాడి వద్ద రూ.4కోట్లతో బ్రిడ్జి నిర్మించనున్నట్లు ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. బ్రిడ్జి నిర్మించే ప్రాంతాన్ని శనివారం సర్పంచ్ బాలస్వామియాదవ్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణంతో చిక్కేపల్లితోపాటు కోడేర్ మండలంలోని మైలారం గ్రామస్తులకు రవాణాపరంగా ఇబ్బందులు తొలుగుతాయన్నారు. ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు చెప్పారు. త్వరలోనే పనులను ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ కృష్ణ, బీఆర్‌ఎస్ నాయకులు వెంకట్రాములుయాదవ్, ధర్మారెడ్డి, ఖాదర్ పాల్గొన్నారు.



బ్రిడ్జి నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి

నేతన్నల సంక్షేమానికే క్లస్టర్ ఏర్పాటు



మాట్లాడుతున్న చేనేత, జౌళిశాఖ ఏడీ గోవిందయ్య

అమరచింత: అమరచింత చేనేత సహకార సంఘం ప్రభుత్వపరంగా చేనేత క్లస్టర్‌గా మారిందని.. దీంతో సంఘం పరిధిలోని 209 మంది నేత కార్మికులు లబ్ధి పొందనున్నారని చేనేత, జౌళిశాఖ ఏడీ గోవిందయ్య తెలిపారు. శనివారం పట్టణంలోని చేనేత సహకార సంఘం కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని చేనేత కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పించారు. 2017లో అమరచింతకు చేనేత క్లస్టర్ కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులతో మంజూరైందన్నారు. అప్పట్లో జియోట్యాగ్ నంబర్ కలిగిన చేనేత కార్మికులతో సంఘం ఏర్పాటు చేసినట్లు వివరించారు. అమరచింత చేనేత సహకార సంఘం పరిధిలో తిప్పడంపల్లికి చెందిన కార్మికులు సైతం సభ్యులుగా కొనసాగుతున్నారన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం క్లస్టర్ ద్వారా మొదటి విడతగా 104 మంది కార్మికులకు ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ మగ్గాలు, జకాటీలు, డబ్బా వైనింగ్ పరికరాలను అందజేస్తారని వివరించారు. వీటితో పాటు అప్పట్లో సభ్యత్వం ఉండి చనిపోయిన వారి స్థానంలో కుటుంబంలో కొత్తగా జియోట్యాగ్ నంబర్ పొందిన వారికి అవకాశం ఇవ్వనున్నామన్నారు. అర్హులైన వారు సహకార సంఘం పాలక మండలి ద్వారా తమ పేర్లను నమోదు చేసుకొని తగు వివరాలతో జిల్లా జౌళిశాఖ కార్యాలయంలో నివేదించాలని కోరారు. 60 నుంచి 65 ఏళ్ల వయసున్న చేనేత కార్మికులకు ప్రభుత్వం చేనేత బీమా పథకం వర్తింపజేసే అవకాశం ఉన్నందున అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నేతన్నకు చేయూత పథకంలో సభ్యత్వం ఉండి మృతిచెందిన వారి వివరాలను జిల్లా కార్యాలయంలో సమర్పించి రావాల్సిన పరిహారం వారి నామినీలకు అందించే చర్యలు చేపడుతున్నామన్నారు. చేనేత కార్మికుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని.. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఓ రాజేశ్వర్‌రెడ్డి, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు మహంకాళి చంద్రమోహన్, కార్యదర్శి క్యామ శ్రీను, రామలింగం, పారుపల్లి సత్యన్న, సాంబరి సత్తి పాల్గొన్నారు.

విద్యార్థులకు చేయూత



పెబ్బేరు రూరల్: మండలంలోని శాఖాపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన జక్కుల వెంకటయ్య చేయూతనందించారు. తన తల్లి కిష్టమ్మ జ్ఞాపకార్థం విద్యార్థులకు టై, బెల్ట్, బ్యాడ్జీలు సమకూర్చేందుకుగాను శనివారం హెచ్‌ఎం నర్సింహకు రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో రామకృష్ణ, పరమేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమ్మె నోటీస్



పెబ్బేరు రూరల్: జిల్లా పంచాయతీరాజ్‌శాఖ కార్యాలయ ఏఓకు శనివారం పంచాయతీ కార్మికులు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు పుట్ట ఆంజనేయులు, మండ్ల రాజు మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని తెలిపారు. మొత్తం 17 డిమాండ్ల సాధన కోసం 34 రోజుల పాటు సమ్మె చేయగా, కేవలం మూడు డిమాండ్లను మాత్రమే పరిష్కరిస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ కార్మికులు మరో పోరాటానికి సిద్ధమవుతున్నట్లు తెలిపారు. అక్టోబర్ 1న చలో హైదరాబాద్, 2వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నిక్సన్, రమేష్, రాము, కుర్మయ్య, వెంకటయ్య, హనుమంతునాయక్, రాములు, పుష్పానాయక్, సుగ్రీవుడు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని బంగారమ్మగడ్డ కాలనీలో ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికుల వివరాల మేరకు.. బంగారమ్మగడ్డ కాలనీకి చెందిన రామాంజనేయులు కొంతకాలంగా మానసిక ఆందోళనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి తాడును కోసేశారు. అనంతరం చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగా ఉందని గ్రామస్తులు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఆత్మకూర్: పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు అన్నారు. ఇండియన్ స్వచ్ఛతా లీగ్ 2.0లో భాగంగా శనివారం స్థానిక శ్రీవాణి హైస్కూల్‌లో స్వచ్ఛత హైసేవ, వేస్ట్ టు వండర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పనికిరాని వస్తువులతో వివిధ రకాల కళాకృతులను తయారు చేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనికిరాని వస్తువులతో విద్యార్థులు తయారు చేసిన పరికరాలు అద్భుతమని అభినందించారు. వ్యర్థాలను ఎక్కడబడితే అక్కడ పారవేయకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్, పాఠశాల డైరెక్టర్ టీజీ విశ్వేశ్వర్, ప్రిన్సిపాల్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



వ్యర్థాలతో తయారు చేసిన వస్తువులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పాఠశాలల బలోపేతానికి తోడ్పాటునందించాలి

పాన్‌గల్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి విద్యార్థుల తల్లిదండ్రులు తమవంతుగా తోడ్పాటునందించాలని హెచ్‌ఎం లక్ష్మణ్‌యాదవ్ కోరారు. మండలంలోని తెల్లరాళ్లపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తులు, నోట్‌పుస్తకాలు, మధ్యాహ్నభోజనం, రాగిజావ అందజేయడంతోపాటు మెరుగైన విద్య అందిస్తున్నట్లు తెలిపారు. పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. సమావేశంలో ఎస్‌ఎంసీ చైర్‌పర్సన్ యశోద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల శ్రమదానం



ఆత్మకూర్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–2 ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పలు కాలనీల్లో చెత్తాచెదారం, పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మెర్సి వసంత, వైస్ ప్రిన్సిపాల్ రాధిక, అధ్యాపకులు షకీల్ అహ్మద్, చక్రపాణిరెడ్డి, శ్రీనివాసులు, గోపాల్, వెంకటేశ్వర్‌రెడ్డి, లత, గిరిధర్, సహదేవ్, సురేష్ పాల్గొన్నారు.

హరితహారంలో భాగస్వాములు కావాలి



కొత్తకోట: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పి.సుఖేశిని కోరారు. పట్టణంలోని 6, 9 వార్డుల్లో శనివారం ఇంటింటికీ మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకొని మొక్కల పెంపకాన్ని పెద్దఎత్తున చేపట్టాలన్నారు. పరిసరాల శుభ్రత, పచ్చదనంతో ప్రజల జీవనం ఆరోగ్యకరంగా ఉంటుందన్నారు. ప్రతి మొక్క వృక్షంగా ఎదిగే వరకు కాపాడే బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సంధ్య, రవీందర్‌రెడ్డి, రవికుమార్, వికాస్, మహేష్, వినోద్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

హెలీప్యాడ్ ఏర్పాటుకు స్థల పరిశీలన

కొత్తకోట రూరల్: రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా శనివారం కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ మండలంలోని సంకిరెడ్డిపల్లి శివారులో హెలీప్యాడ్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. మంత్రి అక్కడే ప్రీ యూనిక్ కంపెనీ నిర్మాణానికి భూమిపూజ చేసి పెద్దమందడి మండలం బుగ్గపల్లితండా సమీపంలో నిర్మించిన మిషన్ భగీరథ నీటి పంపులను ప్రారంభించనున్నారు. స్థల పరిశీలన అనంతరం కొత్తకోటలోని సింగిల్‌విండో కార్యాలయ ఆవరణలో ఉన్న ఫర్టిలైజర్ గోదాంను తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలపై ఆరా తీశారు. ఎరువుల కొరత తలెత్తకుండా చూడాలని పీఏసీఎస్ డైరెక్టర్ కొట్టం వంశీధర్‌రెడ్డికి సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ బాల్‌రెడ్డి, సీఈఓ బాలరాజు, సిబ్బంది శివ, చందు, విష్ణు, మల్లికార్జున్ ఉన్నారు.

పరికరాల పంపిణీలో అలసత్వం

పాన్‌గల్: ఉపాధి హామీ కూలీలకు పరికరాలు పంపిణీ చేయకుండా అలసత్వం ప్రదర్శించడం సరికాదని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు కాకం బాలస్వామి విమర్శించారు. మండలంలోని తెల్లరాళ్లపల్లిలో శనివారం నిర్వహించిన పార్టీ నాయకుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు అవసరమైన పనిముట్లు కొన్నేళ్లుగా పంపిణీ చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూలీలు తమ స్వంత పనిముట్లతోనే పనులు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అధికారులు స్పందించి కూలీలకు పనిముట్లు పంపిణీ చేయాలన్నారు. సహదేవ్, పరందాములు, నాగశేషి, సలేశ్వరం ఉన్నారు.

మంత్రి కృషితో రోడ్ల విస్తరణ

వనపర్తిటౌన్: వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కృషితోనే జిల్లా కేంద్రంలో రోడ్ల విస్తరణ సాధ్యమైందని మున్సిపల్ వైస్‌చైర్మన్ వాకిటి శ్రీధర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్ చౌక్‌లో శనివారం రోడ్ల విస్తరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగవరం, చిట్యాల, హైదరాబాద్ రోడ్ల విస్తరణ పనులు పూర్తయ్యాయని, పాన్‌గల్, పెబ్బేర్ రోడ్ల విస్తరణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

అంగన్‌వాడీలపై నిర్లక్ష్యం తగదు

పెబ్బేరు రూరల్: అంగన్‌వాడీల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని సీఐటీయు జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు అన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమీపంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలు 13 రోజులుగా రిలే నిరహార దీక్ష చేపట్టినా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. నిక్సన్, రమేష్, రాము, మద్దిలేటి, మండ్ల రాజు, శారద, నారాయణమ్మ, కవిత, రాధ, సుమతి భాగ్యలక్ష్మి, విజయ, జ్యోతి, శారద, అరుణ, సుగుణ, శాంతాబాయి పాల్గొన్నారు.

విద్యుత్ లోఓల్టేజీ సమస్యపై ఆందోళన

కొత్తకోట: పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో విద్యుత్ లోఓల్టేజీ సమస్యను తీర్చాలని డిమాండ్ చేస్తూ శనివారం కాలనీవాసులు స్థానిక సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. కాలనీవాసుల ఆందోళనకు బీజేపీ కౌన్సిలర్ నవీన్‌రెడ్డి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 16నెలలుగా విద్యుత్ లోఓల్టేజీ సమస్యతో సతమతమవుతున్నామని, విషయాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ ఇతర అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ లోఓల్టేజీతో ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోతున్నాయని వాపోతున్నారు. ఇళ్లకు వినియోగించే కరెంట్‌కు బిల్లులు సక్రమంగా చెల్లిస్తున్నా లోఓల్టేజీ సమస్యను పరిష్కరించడంలేదని తెలిపారు. వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని విద్యుత్‌శాఖ అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

హైలో హైలెస్సా..

ఆత్మకూర్: కాలం చెల్లిన డొక్కు బస్సులతో ఇటు ప్రయాణికులు, అటు ఆర్టీసీ సిబ్బంది ముప్పుతిప్పలు పడుతున్నారు. ఎప్పుడు మొరాయిస్తాయో తెలియక సతమతమవుతున్నారు. ఆత్మకూర్ బస్టాండ్‌లో శనివారం గద్వాల డిపోకి చెందిన బస్సు స్టార్ట్ కాలేదు. దీంతో ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులు తొయ్యాల్సి వచ్చింది. ఆర్టీసీ చార్జీలను అమాంతంగా పెంచి.. ప్రయాణికులకు మాత్రం డొక్కు బస్సులను ఏర్పాటు చేస్తున్నారని పలువురు అసహనం వ్యక్తం చేశారు. కాలం చెల్లిన బస్సులను పక్కనబెట్టి కొత్త బస్సులను నడపాలని కోరుతున్నారు.



ఆత్మకూర్ బస్టాండ్‌లో బస్సును తోస్తున్న ప్రయాణికులు

అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్‌లో చేరికలు

కొత్తకోట రూరల్: రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి, ప్రజాసంక్షేమ పథకాలను చూసి వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని చర్లపల్లికి చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు 100మందికిపైగా శనివారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరగా, గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలందరూ కలిసికట్టుగా పనిచేసి మరోసారి బీఆర్‌ఎస్‌ను అధికారంలోకి తేవాలని కోరారు. జెడ్పీ వైస్‌చైర్మన్ వామన్‌గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, ప్రశాంత్, శ్రీనివాసులు, పి.విశ్వేశ్వర్, కె.శ్రీనివాస్‌జీ, నర్సింహాగౌడ్, మహేష్, వికాస్, వెంకటేష్, రాములు, ప్రభాకర్, వెంటకయ్య, సత్యన్న పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

రేపు ఆశా కార్యకర్తల సమ్మె

పెబ్బేరు రూరల్: ఆశా కార్యకర్తలకు రూ.18 వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25న నిర్వహించే సమ్మెకు ఆశా కార్యకర్తలు అధికసంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు, కార్యదర్శి పుట్టా ఆంజనేయులు కోరారు. శనివారం జిల్లాకేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆశా కార్యకర్తల సంఘం జిల్లా అధ్యక్షురాలు బుచ్చమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. భాగ్య, అనసూయ, చిట్టెమ్మ, శ్యామల, సంధ్య, మంజుల, పుష్ప, అలివేల ఉన్నారు.